క్లుప్తంగా

నేడు బంగారుపాళెంలో 'వెన్నుపోటు దినం'

బంగారుపాళెం: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం మోసాన్ని ఎండగట్టేందుకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు సమస్యలు తెలపవచ్చన్నారు. సమస్యలను వినతి రూపంలో ఇవ్వాలని వివరించారు.

నీతి పద్యాలతో నైతిక విలువలు



నీతి పద్యాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి

ఐరాల: నీతి పద్యాలు చదివితే నైతిక విలువలు పెంపొందుతాయని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులచే పద్యాలు, కథలు చెప్పించి వాటి భావాన్ని వివరించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి వాటిల్లే ముప్పు గురించి వివరించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయం నుంచి పుస్తకాలు తీసుకెళ్లి ఇంట్లో కూడా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. విజ్ఞాన శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

బంగారుపాళెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వర్ణాంధ్రప్రదేశ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు జవహర్‌బాషా, సీఆర్‌సీ సుశీల బహుమతులను అందజేశారు. వేసవి శిక్షణా తరగతులు ఈ నెల 6వ తేదీన ముగియనున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్ పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ



రైతులకు దాణా అందజేస్తున్న పశువైద్యాధికారులు

బంగారుపాళెం: రైతులకు రాయితీ పశువుల దాణా సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆసీఫ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో మంగళవారం రైతులకు 50 శాతం రాయితీతో దాణా బస్తాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, మండలానికి మొదటి విడతగా 40 టన్నుల పశువుల దాణా సరఫరా చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రెండో విడత రాయితీ దాణా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

తవణంపల్లె హైస్కూల్ హెచ్‌ఎంగా వేణుగోపాల్ రెడ్డి

తవణంపల్లె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా వేణుగోపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఐరాల మండలం కాణిపాకం హైస్కూల్లో విధులు నిర్వర్తిస్తున్న వేణుగోపాల్ రెడ్డి పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి బాధ్యతలను నూతన హెచ్‌ఎంకు అప్పగించారు.

రామాపురంలో జాతర



గుడిపాల: మండలంలోని 190 రామాపురం దళితవాడలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మహిళలందరూ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలిపోసి మొక్కులను చెల్లించుకున్నారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. రాత్రి వీధినాటకం ప్రదర్శించారు.

గురజాల అనే నేను..

చిత్తూరు నియోజకవర్గంలోని దాదాపు 2 లక్షల మందికి పైగా ఓటర్లకు తాను గెలిస్తే ఏం చేస్తానో చెబుతూ గురజాల జగన్‌మోహన్ నాయుడు సొంత మేనిఫెస్టో రూపొందించారు. దీన్ని చూసిన ప్రజలు కూటమి అభ్యర్థిని గెలిపించారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన సూపర్ సిక్స్ ఒక్కటి ఆచరణలోకి రాకపోగా, చిత్తూరు లాంటి జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, ఐఐఐటీ, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తామన్నారు. గుడిపాలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గార్మెంట్స్, షూ కంపెనీ పెడతామని ఇచ్చిన హామీల్లో కార్యరూపం దాల్చినవి ఒక్కటీలేవు.



ఇదే కదా వెన్నుపోటు..!

● ఎన్నికల వేళ చిత్తూరుపై వరాల జల్లులు ● ఏడాదిలో ఒక్క హామీ నెరవేర్చని వైనం

చిత్తూరు అర్బన్: ఓట్లేసి గెలిపిస్తే సంక్షేమ పథకాల ద్వారా ప్రజల స్థితిగతులను మారుస్తామన్నారు. సంపద సృష్టిస్తామన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఒట్టుతీసి గట్టున పెట్టారు. కాలచక్రం గిర్రున తిరిగి కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి ఏడాది పూర్తి చేసుకుంది. కానీ ప్రజల చెవులో పువ్వులు తప్ప.. ఒక్క హామీ నెరవేర్చలేదు. దీన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుధవారం చిత్తూరులో వెన్నుపోటు దినం నిర్వహిస్తోంది.


దగ్గుమళ్ల ఖాతాలో..

చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావు తన వంతు వాగ్దానాలుగా యూనివర్సిటీ ఏర్పాటు, మామిడికి మద్దతు ధర ఇవ్వడానికి మ్యాంగో బోర్డు, ఏనుగుల దాడుల నివారణకు బంగారుపాళ్యం నుంచి కుప్పం వరకు సోలార్ ఫెన్సింగ్, అంతర్జాతీయ కంపెనీల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, అడవిపల్లె రిజర్వాయర్ నుంచి తెలుగు గంగ నీటిని చిత్తూరు తీసుకొస్తామని, చిత్తూరులో ఆటోమొబైల్ పార్కు, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, క్రీడల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, కాట్పాడి – తిరుపతి మధ్య డబుల్ లైన్ మంజూరు, నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీ, నిరుద్యోగులకు స్టడీ సర్కిల్ ఏర్పాటు, ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల ఏర్పాటు, సీఎంసీ ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు, ప్రతి నియోజకవర్గంలో వెనుకబడ్డ వర్గాలకు కమ్యూనిటీ హాలు నిర్మించుకోవడానికి సహకారం అందిస్తామని హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆయన జిల్లా కేంద్రంలో ప్రజలకు కనీస దినాలు అందుబాటులో ఉండరనే విషయం ప్రజలకు అర్థమైంది. ఇక హామీలు అమలంటారా..? ఒక్కటంటే ఒక్కటి అమల్లోకి వస్తే ఒట్టు.

ఏడాది పాలన.. కూటమి వంచన

● సంక్షేమ పథకాలకు దూరమైన మహిళలు
● వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ రాజ్యం
● హామీలిచ్చి మోసం చేసిన కూటమి

ఇల్లాలి పేరుపై ఇంటి పట్టా..పాఠశాల తెరిచే సమయానికి అమ్మ ఖాతాల్లో అమ్మ ఒడి డబ్బు.. పేదరికం నుంచి బయటపడేందుకు చేయూత.. గత ఐదేళ్ల పాలనలో మహిళల కోసం వైఎస్సార్‌సీపీ అమలుచేసిన పథకాలివి. ఆ అయిదేళ్లు వైఎస్ జగన్ సర్కారు అతివలకు అగ్రస్థానం ఇచ్చింది. కానీ కూటమి ఏడాది పాలనలో మోసం తప్ప సాయం లేదు. ఉచిత బస్సు అని ఏడాది గడిపేసింది. తల్లికి వందనం ఇవ్వలేదు. నెలకు రూ.1500 ఇస్తామన్న హామీపై ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం వంచనకు నిదర్శనం.



వైఎస్సార్ చేయూతలో పాల్గొన్న మహిళలు(ఫైల్)

గుడిపాల: ఏడాది కూటమి పాలనలో మహిళలకు ఎదురుచూపులే మిగిలాయి. ఉచిత బస్సు ఎక్కిస్తారనుకుంటే .. రేషన్ డిపోల ముందు నిలబెట్టారు. తల్లికి వందనం ఇస్తారనుకుంటే... ఇది వరకు ఉన్న పథకాలకు మంగళం పాడేశారు. నెలకు రూ.1500 పై ఆశలు పెట్టుకుంటే .. ఆమాట తాము చెప్పలేదన్నట్టే వ్యవహరిస్తున్నారు. మూడు సిలిండర్లు ఫ్రీ అన్నారు. రెండో సిలిండర్ డబ్బులు ఎప్పుడు ఎంతమందికి పడ్డాయో తెలియదు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ హామీలు అని చెప్పి మహిళలను నమ్మించిన టీడీపీ ఏడాదిలో ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకపోయింది. కూటమి పాలనలో తమకు తీరని అన్యాయం జరిగిందని ప్రజలందరికీ అర్థమైపోయింది. దీంతో మహిళలందరూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమం అందేదెప్పుడో..?

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఎంత మంది పిల్లలను చదివిస్తే అంత మందికి తల్లికి వందనం పేరుతో రూ.15వేలు ఇస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. 19–59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని నమ్మించారు. ఇవేవీ ఇవ్వలేదు.

మూడు సిలిండర్లు ఎప్పుడో?

ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు. దీపావళి పండుగ తరువాత ఒక గ్యాస్ సిలిండర్ మాత్రమే ఇచ్చారని, అందులో కూడా చాలామందికి డబ్బులు జమకాలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా మహిళల చార్జీల బాదుడు తప్పలేదు. తల్లికి వందనం ఒక ఏడాది పోయింది. వచ్చే ఏడాది అయినా ఈ పథకం అమలవుతోందో లేదో తెలియడం లేదు. నష్టపోయిన ఏడాది డబ్బులు పరిస్థితి ఏమిటా అని మహిళా లోకం ఇప్పుడు ప్రశ్నిస్తోంది.

మహిళలకు మోసం



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీలు ఇంతవరకు నెరవేర్చలేదు. మహిళలను తీవ్రమైన మోసం చేశారు. ఏడాదిలో మహిళలకు ఒక్క పథక మూ అందించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో మహిళలను ఎంతగానో గౌరవించారు. ఇచ్చిన మాట ప్రకారం, చెప్పిన తేదీకి ఆసరా, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత ఇలా అనేక పథకాలు అందించారు.

– లలిత, వసంతాపురం, గుడిపాల

మోసం చేశారు



ఎన్నికల్లో గెలుపు కోసం మాయమాటలు చెప్పి చంద్రబాబుతోపాటు కూటమి పార్టీల నాయకులు మోసం చేశారు. అమలు చేయలేని హామీలు ఇచ్చారు. ఏడాదిగా మహిళల పేరిట ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. ప్రజలంతా చంద్రబాబు మోసాన్ని ఇప్పటికే అర్థం చేసుకున్నారు. సరైన సమయంలో ఓటు ద్వారా నిర్ణయం తీసుకుంటాం. మరో నాలుగేళ్లు ఈ ప్రభుత్వాన్ని ఎలా భరించాలో ఏమో!

– పందుసాహెబ్, పొన్నేదుపల్లి, తవణంపల్లె

ఆర్థికంగా ఇబ్బందులు



ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఒక్క పథకమూ అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది. జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్న అయిదేళ్లు మహిళలకు ఆదరణ పెరిగింది. ఇంట్లో కూడా మహిళలను గౌరవించే వారు. పథకాలు అన్నీ మహిళల పేరునే ఇవ్వడంతో తలెత్తుకొని జీవించేవారు. ఇప్పుడలాంటి పరిస్థితి లేదు.

– వెంకట్రామిరెడ్డి, రెడ్డివారిపల్లె, ఐరాల

బాబు మోసం చేశారు



సూపర్ సిక్స్ పేరుతో మహిళలను చంద్రబాబు దారుణంగా మోసం చేశారు. ఉచిత బస్సు, విద్యాదీవెన, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి అంటూ చెప్పి ప్రస్తుతం అందరినీ మోసం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తయింది. ఒక్క పథకం మహిళలకు చేరలేదు. పథకాలు అమలు చేస్తారా లేదో తెలియదు.

– కళైఅరసి, మాజీ ఎంపీటీసీ, నంగమంగళం

వైభవంగా ఇంద్రవరదుని రథోత్సవం

యాదమరి: వరదరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా కీలక ఘట్టమైన రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆద్యంతం భక్తుల కోలాహలం మధ్య నారాయణుని సంకీర్తనలతో వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాలలో అతి కీలకమైన రథోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. కాస్త ఆలస్యంగా రథోత్సవం ప్రారంభమైనా భక్తులు నిరీక్షించి స్వామి సేవలో తరించారు. ముందుగా ఉత్సవమూర్తికి సుగంధభరితమైన వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేద బ్రాహ్మణులచేత వేద పారాయణాలతో స్వామి వారిని రథంపై అధిరోహించారు. భక్తుల కోలాహలం మధ్య ఇంద్రవరదుని రథోత్సవం ఒక్కో అడుగుతో ముందుకు సాగింది. అంతకు ముందు మూలవర్లకు పుష్ప కైంకర్యం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు తేరుమెట్ల ఉత్సవం, తోట ఉత్సవం జరిపించారు.



భక్తజన సందోహం నడుమ రథోత్సవం

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

బంగారుపాళెం: మండలంలోని బంగారుపాళెం–అరగొండ రహదారిపై కొత్తపల్లె బ్రిడ్జి వద్ద మంగళవారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తగ్గువారిపల్లెకు చెందిన దొరై కుమారుడు మురుగేష్(30) ద్విచక్రవాహనంపై కొత్తపల్లె వైపు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన మురుగేష్‌ను ప్రథమ చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఐరాల: మండలంలోని గొల్లవారిపల్లెకు చెందిన అన్నదమ్ములను కర్రతో దాడి చేసిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ నరసింహులు కథనం మేరకు ఈ నెల 1వ తేదీ గొల్లవారిపల్లెకు చెందిన అన్నదమ్ములు సాయి కృప, సాయి కిషోర్‌పై అదే గ్రామానికి చెందిన సంగీతం గణేష్ కర్రతో దాడి చేయగా సాయి కృపతోపాటు అతని తమ్ముడు గాయపడ్డారు. సాయి కృప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంగీతం గణేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లాభసాటి పద్ధతులు అవలంబించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగపద్మిని

బంగారుపాళెం : సాగులో రైతులు లాభసాటి పద్ధతులను అవలంబించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. మండలంలోని కూర్మాయిపల్లెలో మంగళవారం కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వ్యవసాయంలో లాభసాటి పద్ధతులను అనుసరించి ఆర్థిక ప్రయోజనం కలిగించే పంటలను సాగుచేయాలన్నారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సంధ్యారాణి మాట్లాడుతూ లో దుక్కులు చేసుకోవాలన్నారు. వేరుశనగ, ఇతర పంటల్లో సూచించిన విత్తన మోతాదు వేయాలన్నారు. పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు. మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, ఉద్యానశాఖ అధికారి సాగరిక మాట్లాడుతూ, లాభసాటి ఉద్యానవన పూలు, కూరగాయల సాగులో రైతులు అనుసరించాల్సిన ఆధునిక పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీరూ సాహెబ్, సాయిజా, నాగేంద్ర పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ నాశనం



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శ్యామ్ సుగుణకుమారి

గుడిపాల: బాల్య వివాహాలతో చిన్నారుల భవిష్యత్ నాశనమవుతుందని సీడీపీవో శ్యామ్ సుగుణకుమారి అన్నారు. మండలంలోని వసంతాపురం, పేయనపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్లలోపు ఉన్న బాలికలను గుర్తించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమాజంలో ఎదురయ్యే సామాజిక, లైంగిక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు స్వర్ణలతాదేవి, తోయాద్రాక్షి, మహిళా పోలీసులు పావని, యువశ్రీ, పీఎం సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, షైలా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నో డయేరియాపై ముందస్తు చర్యలు చేపట్టి మందులు అందుబాటులో ఉంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లను సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై కళాజాత ప్రదర్శన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

బంగారుపాళెం: మండల కేంద్రంలో మంగళవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, క్షయ వ్యాధిపై కళాజాత ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. స్థానిక బస్టాండ్ వద్ద కళాజాత బృందం డప్పులు వాయిస్తూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఎలా వస్తాయి. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల వాడకంపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఐసీటీసీ కౌన్సిలర్ బాబు మాట్లాడుతూ, సమాజంలో ప్రజలకు సుఖవ్యాధులు, ఎహెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై కళాజాత ప్రదర్శనల ద్వారా చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తనకాయల పంపిణీ

గుడిపాల/కాణిపాకం: వేరుశనగ విత్తనకాయలను బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని బసవాపల్లె, మరకాలకుప్పం, పాపసముద్రం,189 కొత్తపల్లె, నారగల్లు పంచాయతీల్లో బుధవారం పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. 5వ తేదీన రామభద్రాపురం, తిమ్మయ్యపల్లె, 6 పానాటూరు, బొమ్మసముద్రం, నంగమంగళం, 9న చిత్తపార, ఎఎల్ పురం, వసంతాపురం, గుడిపాల, 10న పేయనపల్లె, చీలాపల్లె, 197రామాపురంలో పంపిణీ చేస్తామన్నారు. 30 కేజీల బస్తా ధర రూ.1,674 అన్నారు. బసవాపల్లె పంచాయతీలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

నేడు తుమ్మిందలో..

చిత్తూరు మండలం తుమ్మిందలో బుధవారం వేరుశనగ విత్తన పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి వేణుగోపాల్ తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు





చికిత్స చేస్తున్న వైద్యులు, చెర్లోపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

యాదమరి: దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ అన్నారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని దాసరాపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా వేదిస్తున్న మధుమేహం వ్యాధి పట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. అనంతరం గ్రామంలోని గర్భిణులు, వృద్ధులను, అనారోగ్య సమస్యతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చెర్లోపల్లెలో ఉచిత వైద్య సేవలు

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలందించారు. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 27 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కె.పట్నంలో డాక్టర్ ప్రియాంక రోగులకు పరీక్షలు చేయించి మందులు అందించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నాదే లక్ష్యమని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గంగ జాతర



గంగమ్మకు అంబలి సమర్పిస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లెలో మంగళవారం గంగజాతర ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మ వారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. రాత్రి అమ్మవారి శిరస్సును గ్రామంలో ఊరేగించిన తరువాత దండుమారెమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చనున్నారు. అమ్మవారి నిజరూప దర్శనం బుధవారం భక్తులకు కల్పించనున్నారు. రాత్రి అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణాసంచా వేడుకల నడుమ జలప్రవేశం చేయనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలోని వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముంగరమడుగు గ్రామంలో..

మండలంలోని ముంగరమడుగు గ్రామంలో మంగళవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవా రి శిరస్సును ఊరేగించి సోమవారం రాత్రి నడివీధిలో కొలువుదీర్చారు. ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లు సమర్పించారు. జాతర సందర్భంగా రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి అమ్మవారిని జలప్రవేశానికి తరలించనున్నట్లు గ్రామస్తులు చెప్పారు.

పలుచోట్ల గంగ జాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర, మండల పరిధిలోని ప్రశాంత్‌నగర్, ఇరువారం, బీఎన్‌ఆర్‌పేట, 5.వెంకటాపురం, కుర్చివేడు గ్రామాల్లో మంగళవారం గంగజాతర ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారిని కొలువుదీర్చి తొలిపూజ చేశారు. నైవేద్యంగా అంబలిపోసి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ప్రముఖులు గజమాల సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.